

# 3 ఆషాఢభూతి కథ

డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ

**పూర్వం ఒక నిర్జనస్థానంలో ఒక మఠం వుండేది. అక్కడ దేవశర్మ అనే సన్యాసి వుండేవాడు. అతని దగ్గర ఎందరో మహానుభావులు ఇచ్చిన వస్త్రాలు అమ్మగా నిలువ చేసిన ధనం చాలా వుండేది. అందువల్ల ఆ సన్యాసి ఇతరులను ఎవరినీ నమ్మేవాడు కాదు. రాత్రింబవళ్లు మఠంలో వుంచిన ఆ ధనాన్ని కదిలించేవాడు కాదు. అందుకే పెద్దలంటారు, 'డబ్బును ఆర్జించటం కష్టం. ఆర్జించిన ధనాన్ని రక్షించటం కష్టం. ఇలా సంపాదించడంలోనూ, ఖర్చు చేయుటంలోనూ దుఃఖకరాలైన సంపదలంటే ఇబ్బందే' అని.**

ఇంతలో పరుల ద్రవ్యాలను అపహరించే స్వభావం గల ఆషాఢభూతి అనే వాడొకడు మఠంలో వున్న ధనాన్ని గురించి పసిగట్టి, 'ఆ ధనాన్ని ఎలా సంపాదించాలి?' అని ఆలోచించసాగాడు. 'ఈ మఠాన్ని గట్టి శిలలతో నిర్మించినందున కన్నం వేసే వీలు లేదు. ద్వారం చాలా ఎత్తుగా వున్నందున ప్రవేశించడం కష్టం. అందువల్ల మాయమాటలతో నమ్మించి, శిష్యరికం చేస్తే, కొంత కాలానికైనా ఆ సన్యాసి నమ్ముతాడు. కోరిక లేనివాడు ధనానికి అధికారి కాలేడు. సంభోగం మీద అభిలాష లేనివాడు శృంగారప్రియుడు కాలేడు. మూర్ఖుడు ఎప్పుడూ ప్రియాన్ని పలుకలేడు. స్పష్టంగా మాట్లాడేవాడు మోసగాడు కాలేడు' అనుకొని, ఆ సన్యాసి దగ్గరికి వెళ్లాడు. అతనితో, "ఓం నమః శివాయ" అంటూ సాష్టాంగనమస్కారం చేసి వినయంగా, "స్వామీ! జీవితం సారం లేనిది. యౌవనం కొండ వాగులా వేగంగా ప్రవహించిపోతుంది. జీవితం మండిపోయే గడ్డి లాంటిది. సుఖాలు శరత్కాలమేఘాల వంటివి. మిత్రులూ, పుత్రులూ, భార్యా, సేవకులూ- వీళ్లతో గల సంబంధాలు కలల వంటివి-అని నేను చక్కగా తెలుసుకొన్నాను. అందువల్ల నేను ఏం చేస్తే ఈ సంసారసాగరాన్ని దాటగలుగుతానో సెలవీయండి" అని అడిగాడు.

అతని మాటలు విన్న దేవశర్మ వాత్సల్యంతో, "వత్సా! నీవు ధన్యుడివి. నీకు ఇంత చిన్న వయస్సులో ఇంతటి విరక్తభావం కలగటం అభినంద్యం. అందుకే పెద్దలిలా అన్నారు-'పూర్వవయస్సులోనే శమాదిగుణసంపత్తి కలవాడు నిజంగా ధన్యుడు. ఎందుకంటే-శరీరం శిథిలమైపోయే దశలో ఎవరికైనా వైరాగ్యభావం కలుగుతుంది' అని. సత్పురుషులకు వార్ధక్యం మొదట చిత్తంలోనూ, తరువాత శరీరంలోనూ కలుగుతుంది. దుర్జనులకు మాత్రం శరీరంలో తప్ప చిత్తంలో వార్ధక్యం ఎన్నటికీ రాదు. సంసారసాగరాన్ని దాటే ఉపాయం ఏమిటో చెప్పమన్నావు కదా! విను-ఎంతటి పాపాత్ముడైనా భస్మలిప్తాంగుడై, శివమంత్రదీక్షితుడైతే సాక్షాత్తూ శివుడవుతాడు. షడక్షరమంత్రంతో ఒక్క పుష్పాన్నయినా శివలింగం మీద వుంచినవాడు మళ్లీ ఈ మానవజన్మను పొందడు" అని చెప్పాడు.

ఆ మాటలు విని ఆషాఢభూతి, ఆ సన్యాసి పాదాల మీద పడి, భక్తితో, "స్వామీ! అలా అయితే నాకు దీక్షనిచ్చి, నన్ననుగ్రహించండి" అన్నాడు.

అప్పుడు దేవశర్మ, "నాయనా! నిన్ను అనుగ్రహిస్తున్నాను. కానీ, నీవు రాత్రి వేళలో ఈ మఠంలో ప్రవేశించరాదు. ఎందుకంటే-యతులకు నిస్సంగత్వమే శ్రేష్ఠమైనది. అది నీకూ మంచిదే. చెడు సలహాల వల్ల రాజూ, సాంగత్యం వల్ల సన్యాసీ,, గారాబం వల్ల కుమారుడూ, వేదాధ్యయనం లేకపోవటం వల్ల బ్రాహ్మణుడూ, కుపుత్రుని వల్ల వంశమూ, చెడుస్నేహాల వల్ల శీలమూ, స్నేహం దూరం కావటం వల్ల మిత్రతా, నీతి లేకపోవటం వల్ల సంపదా, దూరంలో వుండటం వల్ల స్నేహమూ, గర్వం వల్ల స్త్రీ, పర్యవేక్షణ లేకపోవటం వల్ల సేద్యమూ, త్యాగప్రమాదాల వల్ల ధనమూ నశించిపోతాయని పెద్దలు చెబుతుంటారు. అందువల్ల నీవు వ్రతదీక్షను తీసుకొన్న తరువాత మఠద్వారంలోని తృణకుటీరంలోనే పడుకోవాలి" అన్నాడు.

అప్పుడు ఆషాఢభూతి, "స్వామీ! మీ ఆదేశమే నాకు ప్రమాణం. పరలోకంలో నాకు మంగళం కలగాలన్నదే నా కోరిక" అన్నాడు.

ఆ తరువాత దేవశర్మ ఆషాఢభూతిని శాస్త్రోక్తవిధిగా శిష్యుడుగా స్వీకరించాడు. ఆషాఢభూతి గురువు గారి హస్తాలనూ, పాదాలనూ మర్దిస్తూ సేవలు చేసి సంతృప్తి పరిచాడు. ఇంత జరిగినా ఆ సన్యాసి తన డబ్బు సంచిని మాత్రం వదిలిపెట్టలేదు.

ఒక నాడు గురుశిష్యులిద్దరూ ఒకరి ఇంట్లో రాత్రి పూట వుండవలసివచ్చింది. తెల్లవారగానే ఇద్దరూ లేచి రాసాగారు.

దారిలో ఆషాఢభూతి దేవశర్మతో, "స్వామీ! నా బట్టలతో పాటు ఆ ఇంటి గరికపోచ ఒకటి వచ్చేసింది. దాన్ని భద్రంగా వారికి తిరిగి ఇచ్చివస్తాను" అన్నాడు, గరికపోచ నొకదాన్ని చేత్తో పట్టుకుని చూపుతూ.

దానికి దేవశర్మ నవ్వుతూ, " ఇంత దానికి మళ్లీ అంత దూరం తిరిగివెళ్లాలా? అనవసరశ్రమ కదా!" అన్నాడు.

కానీ ఆషాఢభూతి, "మీకు తెలియనిదేముంది గురుదేవా? ఈ గరికపోచను నా వెంట తీసుకుపోతే, దీన్ని తిరిగి ఇవ్వటానికి మళ్లీ నేను మరో జన్మనెత్తవలసివుంటుంది. ఎవరి వస్తువునైనా తీసుకోవటం, అదీ



వారికి తెలియకుండా, నేరం కిందికి రాదా?" అని ప్రశ్నించి, గురువు అనుమతితో దాన్ని తిరిగి తీసుకెళ్లి ఆ ఇంట్లో తాము రాత్రి పడుకున్న చోట వదిలిపెట్టి వచ్చాడు. అతని నిజాయితీకి సంతోషించిన దేవశర్మ అతని భవిష్యత్తు ఉజ్జ్వలంగా వుంటుందని ఆశీర్వదించాడు. కానీ డబ్బు సంచిని మాత్రం అతని చేజిక్కకుండా కాపాడుకుంటూ వచ్చాడు.

ఇలా కొంత కాలం గడిచిన తరువాత ఆషాఢభూతి, 'ఈ సన్యాసి ఎన్ని ప్రయత్నాలు చేసినా నన్ను నమ్మకపోవటం ఆశ్చర్యంగా వుంది. ఇతన్ని పగటి పూట ఏదైనా ఆయుధంతో చంపుతాను. లేదా విషప్రయోగం చేస్తాను. లేదా పశువులా ప్రవర్తించి చంపుతాను' అనుకొన్నాడు. ఇలా ఆషాఢభూతి ఆలోచిస్తుండగా, దేవశర్మ శిష్యుని కుమారుడొకడు గ్రామాంతరం నుంచి వచ్చి, దేవశర్మతో, "స్వామీ! యజ్ఞోపవీతసంస్కారం చేయించడానికి మీరు మా ఇంటికి రావాలి" అని ప్రార్థించాడు. దేవశర్మ సంతోషంతో అంగీకరించి, ఆషాఢభూతిని వెంట బెట్టుకొని బయలుదేరాడు. దారిలో వారు ఒక నదీతీరాన్ని చేరుకొన్నారు. ఆ నదిని చూసిన దేవశర్మ, తన చంకలో వున్న డబ్బు మూటను బొంతలో భద్రపరచి, దాన్ని సురక్షితమైన చోట వుంచి, నదిలో స్నానం చేసి, దేవతార్చనను ముగించి, ఆషాఢభూతితో, "నాయనా! నేను మలవిసర్జన చేసి వచ్చేవరకూ, నీవు దేవతల విగ్రహాలు గల ఈ బొంతను సావధానచిత్తంతో కాపాడు" అని చెప్పి వెళ్లిపోయాడు.

దేవశర్మ అలా వెళ్లిపోగానే, ఆషాఢభూతి బొంతలోని డబ్బు సంచీని ఎత్తుకొని పారిపోయాడు. దేవశర్మ తన శిష్యుని గుణగణాలతో సంతృప్తుడై వున్నందువల్ల, అతన్ని పూర్తిగా నమ్మి, తీరికగా కూర్చుండిపోయాడు. ఇంతలో బంగారు రంగు కేశాలున్న రెండు పొట్టేళ్లు పోట్లాడుకొంటూ, దేవశర్మ కంటబడ్డాయి. అవి రోషంతో ముందుకూ, వెనుకకూ కదులుతూ వేగంగా తమ తలలను బాదుకొంటూ వుండగా, ఆ ప్రాంతమంతా రక్తపాతం కాసాగింది. ఇంతలో అక్కడికి వచ్చిన ఒక నక్క నేల మీద పడిన రక్తాన్ని ఆస్వాదించసాగింది. అప్పుడు వాటిని చూసిన దేవశర్మ, "అయ్యో! ఈ నక్క ఎంత బుద్ధి లేనిది! ఒక వేళ ఇది ఆ రెండు పొట్టేళ్ల నడుమ పడితే, వాటి తాకిడికి తప్పకుండా చచ్చితీరుతుంది!" అనుకొంటూ వుండగానే, ఆ నక్క ఆ రెండు పొట్టేళ్ల మధ్యా పడిపోయి వాటి పోట్లకు తాళలేక, తల పగిలి కిందపడి చనిపోయింది.

దేవశర్మ నక్క మీద జాలి పడుతూనే, తన డబ్బు సంచీని తలచుకొంటూ మెల్లమెల్లగా నడిచాడు. నదీతీరంలో ఆషాఢభూతి కనబడకపోవటంతో, ఆశ్చర్యపడి, శౌచాన్ని ముగించుకొని, దాచి వుంచి చోట వున్న బొంత కోసం చూడగా, అది అతనికి కనబడలేదు. అప్పుడతడు, "అయ్యో! అయ్యో! నా ధనమంతా దోపిడి అయిపోయింది!" అని అరుస్తూ, నేల మీద పడి మూర్ఛ పోయాడు. కొంత సేపటికి తేరుకొని బిగ్గరగా మళ్లీ, "ఒరే ఆషాఢభూతీ! నన్ను మోసం చేసి ఎక్కడికి పోయావురా? నాతో మాట్లాడరా!" అని కేకలు పెడుతూ, ఏడుస్తూ, అతని అడుగుజాడల వెంట ప్రయాణించసాగాడు. అలా సాయంకాలానికి ఒక గ్రామాన్ని చేరుకొన్నాడు. అక్కడ ఎంతగా వెతికినా కూడా ఆషాఢభూతి అతని కంట బడలేదు. చివరికి ధనం మీది తన వ్యామోహమే తనకు తగిన శాస్తి చేసిందని మనసును తేలికపరచుకొని మళ్లీ తన మఠానికి చేరుకొన్నాడు.

కనుక ఎవరినైనా ఎంత నమ్మాలో అంతే నమ్మాలి. అంతే కాక సన్యాసులకు ధనమోహం కూడదు. ధనం వల్ల కష్టాలు కలుగుతాయని తెలిసినప్పుడు దాన్ని దగ్గరుంచుకోవటం కూడా మంచిది కాదని తెలియజేసే మంచి కథ ఇది. నేటికీ ఆంధ్రదేశంలో నమ్మించి, మోసం చేసేవాడిని అందరూ ఆషాఢభూతి అని వ్యవహరిస్తుంటారు.

**(వచ్చేవారం: సముద్రుని కథ)**